సాక్షి ఒడిశా

మంగళవారం । 14 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 5,07,019లు, బంగారం 41 గ్రాముల 350 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



డబ్బులు దోచేసిన మాయగాడి అరెస్టు

- 8లో



గ్రీవెన్స్‌కు విశేష స్పందన

- 8లో

న్యూస్‌రీల్

క్రికెట్ టోర్నీ విజేతగా అల్‌ఫా క్లబ్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి శ్రీకాంత్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు

బరంపురం: స్థానిక కళ్లికోట్ క్రీడా మైదానంలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న 13వ బిజు పట్నాయక్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన అల్‌ఫా క్రికెట్ క్లబ్ విజేతగా నిలిచింది. అల్‌ఫా క్రికెట్ క్లబ్, రూలఖేల్ ఆర్‌వోసీసీ టీముల మధ్య జరిగిన ఫైనల్‌లో అల్ ఫా టీమ్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 128 పరుగులు చేసింది. అనంతరం 129 పరుగుల విజయ లక్ష్యంతో దిగిన రూలఖేల్ జట్టు నిర్ణీత ఓవర్లలో, 8 వికెట్ల నష్టానికి 124 పరుగులు మాత్రమే చేసి 4 పరుగుల తేడాతో ఓడిపోయింది. మంత్రి శ్రీకాంత్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండాలు విజేతలకు ట్రోఫీ అందజేశారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థికి అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థి సాబొరొ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న సొర ప్రధాని గుడ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న చాంద్రేయ సాబొరొ అనే విద్యార్థి విద్యుత్ షాక్‌తో అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆటలాడుకునేందుకు బయటకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ ఉన్న చెట్టును సాబొరొ ఎక్కే ప్రయత్నం చేయగా చెట్టుపైనున్న 11 కేవీ విద్యుత్ తీగ తగలడంతో కిందపడిపోయాడు. వెంటనే తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలియజేయడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బరంపురం ఆస్పత్రికి తరలించారు.


సేవా దృక్పథం అలవర్చుకోవాలి



బొయిపరిగుడ పాఠశాల ఉపాధ్యాయులతో యజ్ఞేశ్వర పండ

జయపురం: విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని కొరాపుట్ జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి యజ్ఞేశ్వర పండ సూచించారు. బొయిపరిగుడ సమితిలోని పలు పాఠశాలలను సోమవారం సందర్శించి ఆయా పాఠశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్ యూనిట్లను ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్ కార్యకలాపాలు త్వరితగతిన ప్రారంభించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిటీల ఏర్పాటు విధానం, సేవా కార్యక్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాదల్ ప్రకాష్ వర్ధన్, బాబగ్రాహీ రౌత్, అలోక్ రంజన్ మహరాణ, భంజీ కిశోర్ బెహెర తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు అందుకున్న సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్‌కు సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. దేశం గర్వించదగిన క్షణమని కొనియాడారు. ఈ అవార్డు భారతీయ చలనచిత్ర నిర్మాతలకు మరింత స్ఫూర్తినిస్తుందన్నారు. అలాగే ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు గెలుచుకున్న 'ది ఎలిఫెంట్ విస్పర్స్' సిబ్బందికి సైతం అభినందనలు తెలిపారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా



భరత నాట్యం ప్రదర్శన



వేదికపై ఎంపీ చంద్రశేఖర్ సాహు, డీఐజీ సత్యబ్రత్ బోయి, ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు



ఉత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం



కిన్నెరుల ఫ్యాషన్ షో



రాక్ డాన్స్ బృందం ప్రదర్శన



ఒడిస్సీ నృత్య ప్రదర్శన



ఉత్సవాలకు హాజరైన ప్రజలు



సంబల్‌పూరి నృత్య ప్రదర్శన



మాస్ డాన్స్ వేస్తున్న యువతులు

స్థానిక ఐటీఐ క్రీడా మైదానంలో కళింగ మహోత్సవాలు–23 ఉత్సాహంగా సాగుతున్నాయి. దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రత్ బోయి ఆదివారం ప్రారంభ జ్యోతిని వెలిగించారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా సాంస్కృతిక నృత్య కార్యక్రమాలను ప్రారంభించారు. గంజాం జిల్లాకి చెందిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి నృత్య గేయ ప్రదర్శన, ఒడిస్సీ నృత్యం, రాక్ డాన్స్‌లు కనువిందు చేశాయి. కార్యక్రమంలో ఎస్పీ సార్వణ్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

– బరంపురం

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న వందలాదిమంది కార్మికులు

జయపురం: స్థానిక గగణాపూర్ సేవా పేపరు మిల్లు విశ్రాంత శ్రామికులు, శ్రామిక కుటుంబ సభ్యులు, శ్రామికులు తమ డిమాండ్ల సాధనకు ఆందోళన చేపట్టారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 26వ జాతీయ రహదారి జయపురం ప్రధాన కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మిల్లు యాజమాన్యానికి, అధికారులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. అనంతరం ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తక్షణమే తమ డిమాండ్‌లు పరిష్కరించకుంటే ఈనెల 23వ తేదీన రాష్ట్ర విధానసభ ముందు ధర్నా చేపడతామని తెలియజేశారు. మిల్లును సజావుగా నడిపేందుకు బ్యాంక్ నుంచి కంపెనీ రూ.150 కోట్లకు పైగా



రోడ్డుపై మానవహారం చేపడుతున్న దృశ్యం

ఋణం తీసుకున్నా, మిల్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. 2012–2015 అగ్రిమెంట్ ప్రకారం యాజమాన్యం పూర్తి జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. పెన్షన్, పీఎఫ్ బకాయిలు, గ్రాడ్యుటీలు చెల్లించకపోవడంతో శ్రామికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కల్యాణ మండపం ప్రారంభం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక రాణిగుడ ఫారంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన మజ్జిగౌరి కల్యాణ మండపం సోమవారం ప్రారంభించారు. ప్రతీ ఏడాది మజ్జిగౌరి అమ్మవారి జాతర ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. పండగ సమయంలో తాత్కాలికంగా అమ్మవారి ఘటాల కోసం పందిరి నిర్మించి పూజా కార్యక్రమాలను చేపడుతుంటారు. దీంతో శాశ్వత నిర్మాణం చేపట్టాలనే ఆలోచనతో భక్తుల కానుకలు, దాతల విరాళాలతో మండపం నిర్మించారు. అందుకు అవసరమైన స్థలాన్ని స్థానిక వ్యాపారవేత్త హంసరాజ్ దంపతులు విరాళంగా ఇచ్చారు. ఇకపై అమ్మవారి పండగ ఈ మండపంలో నిర్వహిస్తారు.



కొత్తగా నిర్మించిన మండపం

భయం.. భయం

- మూడు జిల్లాల్లో భయానక శబ్ధాలు
- ఇళ్ల నుంచి పరుగులు తీసిన జనాలు

భువనేశ్వర్: రాష్ట్రంలోని భద్రక్, బాలాసోర్, సుందర్‌గఢ్ జిల్లాల్లో వచ్చిన భీకర శబ్ధాలు ప్రజలను బెంబేలెత్తించాయి. సోమవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఎక్కడి నుంచో తెలియని శబ్ధాలు రావడంతో భయకంపితులయ్యారు. ఇటీవల స్వల్ప వ్యవధిలో రాష్ట్రంలో ఇలాంటి శబ్ధాలు రావడం ఇది రెండోసారి. ఇదివరకు 2 జిల్లాలకే పరిమితమైన ప్రకంపనలు, ఈసారి 3 జిల్లాల్లో భయాందోళనలు రేపాయి. అయితే ఈ విపత్కర పరిస్థితులపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు.

భూకంపం వస్తుందని భయం

భూకంపం వస్తుందనే భయంతో ఈ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఈ శబ్ధాలకు గల కారణాలు నిర్ధారణ కాకపోయినా, తక్కువ ఎత్తులో ఎగిరే జెట్ విమానాలు విడుదల చేసే సోనిక్ బూమ్ అవ్వొచ్చని పలువురు పేర్కొన్నారు. ఇటీవల ఫిబ్రవరి 27వ తేదీన మయూర్‌భంజ్ జిల్లా బరిపద, బాలాసోర్ జిల్లాలో కొన్నిచోట్ల ప్రజలకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఈ శబ్ధాన్ని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) వద్ద మైనింగ్ లేదా క్షిపణుల ప్రయోగ కార్యకలాపాలుగా భావించారు. ఇటువంటి శబ్ధాలకు సూపర్ సోనిక్ బూమ్ ప్రేరణగా ప్రసారం అవుతున్న ఊహాగానాలపై ఇంతవరకు శాస్త్రీయ, అధికారికంగా ధ్రువీకరించలేదు. గతేడాది నవంబర్‌లో జాజ్‌పూర్, భద్రక్, కెంజొహర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భారీ పేలుడు శబ్ధం వినిపించింది. అయితే ఇది భూకంపం కాదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) నిర్ధారించింది. 2020 సంవత్సరంలో భద్రక్, జాజ్‌పూర్ జిల్లాల్లో ఇటువంటి సంఘటనలు జరిగాయి.

మొబైల్ కొనలేదని ఘోరం

- భర్తపై కత్తితో భార్య దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత భర్త

భువనేశ్వర్: భార్యకు మొబైల్ కొనిచ్చేందుకు నిరాకరించడంతో ఓ భర్త దాడికి గురయ్యాడు. బొలంగీర్ జిల్లా పుకుట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని కెసెర్కెలా గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈశ్వరి కుమారి, గణేశ్వర్ సునాలకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్ వీరి స్వస్థలం. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. గత కొంతకాలంగా మొబైల్ ఫోన్ కావాలని భార్య అడుగుతోంది. ఈ విషయంపై ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం రాత్రి భర్త నిద్రిస్తున్న సమయంలో ఈశ్వరి వంట గదిలో ఉన్న కూరగాయలు కోసే కత్తి తీసుకొని భర్తపై దాడి చేసింది. తనపై దాడి జరగడంతో మేలుకుని స్వీయ రక్షణ కోసం గణేశ్వర్ ఎదురు తిరగడంతో చేతిపై మరింతగా దాడి చేసింది. ఇరుగుపొరుగు వారు గమనించి గాయాలైన గణేశ్వర్‌ను చికిత్స కోసం భీమ భొయి మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్పారు. ప్రస్తుతం గణేశ్వర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాల తెలియజేశారు.

హెచ్‌3ఎన్‌2 నియంత్రణకు మార్గదర్శకాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో పెరుగుతున్న హెచ్‌3ఎన్‌2 సంక్రమణ పరిస్థితుల నియంత్రణకు రాష్ట్ర ఆరోగ్య – కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ మిశ్రా రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన జిల్లా వైద్యాధికారులకు (సీడీఎంఓ), స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి డైరెక్టర్‌కు సోమవారం సూచనలు చేశారు. హెచ్‌3ఎన్‌2 సంక్రమణతో కోవిడ్ పరిస్థితులు తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జలుబు, దగ్గు లక్షణాలతో బాధపడేవారికి కోవిడ్ పరీక్ష తప్పనిసరిగా చేయాలని పేర్కొన్నారు. హెచ్‌3ఎన్‌2 అరికట్టేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లను నిల్వ చేయాలని, ఐసీయూ వార్డుల్లో పడకలు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంఫ్లూయెంజాకు ప్రత్యేకమైన ఔషధం లేదా చికిత్స లేదని డాక్టర్ నిరంజన్ మిశ్రా రాసిన లేఖలో వివరించారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఎవరికైనా ఉంటే మాస్కులు ధరించి సమూహంగా కాకుండా ఒంటరిగా ఉండడం మేలని పేర్కొన్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం ఆరోగ్యకరమన్నారు. వైద్యుల సలహా మేరకు చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరాలని సూచించారు.

అగ్ని ప్రమాదంలో తల్లీకూతుళ్లకు గాయాలు



రాయగడ: మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



జయపురం: గాయాలతో చికిత్స పొందుతున్న బాధితులు

జయపురం: ఇంటిలో ఉంచిన పెట్రోలు కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో తల్లీకూతుళ్లు గాయపడిన ఘటన జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి కుసుమగుడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని దీప్తి పంగి తమ ఇంటిలో స్కూటీ కోసం ఒక బాటిల్‌తో పెట్రోలు ఉంచారు. అయితే ప్రమాదవశాత్తు ఆ పెట్రోలు వలన అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో తల్లి దీప్తి పంగికి మంటలు అంటుకున్నాయి. తల్లికి అంటిన మంటలను ఆర్పేందుకు ఆమె కుమార్తె రీణా చేసిన ప్రయత్నంలో ఆమెకు కూడా గాయాలయ్యాయి. వెంటనే ఇంటిలోని సభ్యులు మంటలను ఆర్పివేశారు. అనంతరం వారిని వెంటనే చికిత్స నిమిత్తం కుంద్రా కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జయపురంలోని కొరాపుట్ జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స కొనసాగుతోంది.

ప్రేమ్ పహాడ్‌లో మంటలు

రాయగడ: స్థానిక చెక్కాగుడలో ఉన్న ప్రేమ్ పహాడ్‌లో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో పహాడ్‌కు ఇరువైపులా ఉన్న చెట్లకు నిప్పు అంటుకుంది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో విలువైన ఔషధ మొక్కలు దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు.

క్లుప్తంగా

'రింగ్ రోడ్ నిర్మాణం చేపట్టండి'


ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా

బరంపురం: నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్న దృష్ట్యా రింగ్ రోడ్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే విక్రమ్ పండా కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అతిపురాతన పట్టణమైన బరంపురం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ హోదా పొంది సుమారు 13 ఏ ళ్లు గడుస్తున్నా రింగ్ రోడ్ నిర్మాణంలో జాప్యం సరికాదన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గాలంటే నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా దక్షిణ ఒడిశా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఎంకేసీజీ ఆస్పత్రిలో నియామకాలు చేపట్టి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోపాల హల్దార్

జయపురం: స్థానిక జయపురం విక్రమదేవ్ స్వయం పాలిత కళాశాలలో ఇండియన్ ఫిలాసఫీ, సంస్కృతిపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. విద్యావేత్త, పొలిటికల్ శాస్త్రవేత్త, రచయిత డాక్టర్ అభిరాం బిశ్వాల్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐసీపీఆర్ స్పాన్సర్ చేసిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల హల్దార్ మాట్లాడుతూ.. ప్రముఖుల ప్రసంగాల్లో విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని సూచించారు. పొలిటికల్ శాస్త్రవేత్త అభిరాం బిశ్వాల్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో ఘటాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఫిలాసఫీ విభాగం అధికారి ఫ్రాన్సిస్ బర్లా, ప్రొఫెసర్ లెఫ్టినెంట్ డాక్టర్ లక్ష్మణ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఆవుదూడ సజీవ దహనం

సీతానగరం: మండలంలోని పెదంకలాం గ్రామంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు పశువుల శాలలు దగ్ధం కాగా ప్రమాదంలో ఆవుదూడ సజీవదహనమైంది. ఈ సంఘటనపై వీఆర్వో జి.బాబూరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాన్న అప్పలనాయుడు, బలగ గౌరమ్మలకు చెందిన పశువుల శాలలు దగ్ధమయ్యాయి. గ్రామంలోని ప్రజలు అగ్ని మంటలను ఆర్పివేశారు. అయితే తాన్న అప్పలనాయుడుకు చెందిన ఆవుదూడ మంటల్లో చిక్కుకుని మృతిచెందింది. అలాగే గ్రామంలోని ఎస్‌కోట వీధిలో జి.తవిటినాయుడు, జి.చినప్పల నాయుడుల పశువుల శాలలు దగ్ధమయ్యాయి. గ్రామస్తుల సమాచారం మేరకు బొబ్బిలి నుంచి అగ్ని మాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది.

జీడి, మామిడి తోటలు దగ్ధం

సీతంపేట: మండలంలోని నాయకమ్మ గూడ పంచాయతీ పరిధి గడిగుజ్జి, మర్రిమానుగూడ గిరిజన గ్రామాల పరిధిలో సోమవారం జీడి మామిడి తోటలు దగ్ధమవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఆందోళన చెందిన గిరిజనులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సుమారు 10 ఎకరాల్లో తోటలు అగ్నికి ఆహుతయ్యా యని గ్రామస్తులు వాపోతున్నారు. తమను ఐటీడీఏ ఆదుకోవాలని కోరుతున్నారు.

97.86 శాతం ఈ-క్రాప్ నమోదు

పార్వతీపురం: జిల్లాలో 2022–23 రబీ సీజన్‌లో 46,532 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ సోమవారం తెలిపారు. ఈ క్రాప్ నమోదుకు మొదట ఫిబ్రవరి 10 తేదీ గడువుగా నిర్ణయించారు. క్రమేపీ ఆ గడువును మార్చి 4వ తేదీ వరకు పొడిగించారు. ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ఈనెల 17 వరకు ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తామని, గ్రామ సభలను నిర్వహించి అర్హుల జాబితాను తెలియజేస్తామని చెప్పారు. జాబితాలో అభ్యంతరాలుంటే ఆర్‌బీకేల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.

నేడు శంబర పోలమాంబ ఎనిమిదో జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఎనిమిదవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. చదురుగుడి, వనంగుడి కూల్స్రైన్ల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. లడ్డూ ప్రసాదం సిద్ధం చేశారు. భక్తులకు ఎండ తగలకుండా క్యూకాంప్లెక్స్‌ల వద్ద పెండల్స్ ఏర్పాటు చేశారు. సాలూరు సీఐ ధనుంజయరావు, ఎస్ఐ జి.పైడిరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి పట్టణాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.

సీతంపేట ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

సీతంపేట: సీతంపేట ఏరియా ఆస్పత్రికి వైరల్ జ్వరపీడితుల తాకిడి పెరిగింది. ప్రతిరోజు జ్వరాలతో బాధపడుతున్న వారు అధికమంది ఆస్పత్రికి వచ్చి ఉచిత వైద్యసేవలు పొందుతున్నారు. ఎండ తీవ్రత పెరగడంతో వైరల్ జ్వరాలు వ్యాప్తిచెందుతున్నాయని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ఆలయ ప్రతిష్ట


108 కలశాలతో నదీజలాలు తీసుకొస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) ప్రతిష్ఠించిన సీతారామస్వామి ఆలయం

పర్లాకిమిడి: స్థానిక రాణిపేట గ్రామంలో సీతారామ స్వామి ఆలయ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. ధ్వజారోహణ, విఘ్నేశ్వర పూజా, దీపారాధన, అగ్ని ప్రతిష్ట, తిరువీధి ఉత్సవం జరిగింది. మహిళలు మహేంద్రతనయ నుంచి 108 కలశాలతో పవిత్ర జలాలను తీసుకొచ్చి జల ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ ప్రజలు, సీతారామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోటాపోటీగా వేడుకలు

పర్లాకిమిడి: పట్టణంలో ఉగాది వేడుకలు పోటాపోటీగా నిర్వహించేందుకు పలు సంస్థలు సమాయత్తమవుతున్నాయి. రాజ్యసభ ఎంపీ నెక్కంటి భాస్కర రావు పర్లాకిమిడి విచ్చేసి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో చైతన్య, కళాంజలి సంస్థలతో మాట్లాడారు. మరోవైపు బీజేడీ నాయకుడు తిరుపతి పాణిగ్రాహి రాంనగర్‌లోని హైటెక్ ప్లాజా గ్రౌండ్స్‌లో ఎప్పటిలాగే భారీ ఎత్తున ఉగాది సంబరాలు జరుపుతున్నామని తెలియజేశారు. హైదరాబాద్ నుంచి జబర్దస్త్ టీమ్ బుల్లెట్ భాస్కర్, సునామీ సుధాకర్, నరేష్, శాంతి స్వరూప్, ఇమాన్యుయెల్, అప్పారావు, వినోద్, మోహన్‌లు ఉగాది రోజుల స్కిట్‌లు ప్రదర్శించనున్నారు. అలాగే చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పంచాంగ శ్రవణం, చైతన్య సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని కార్యదర్శి బి.జనార్ధనరావు పేర్కొన్నారు. మరోవైపు దక్షిణ బ్రాహ్మణ సంఘం తరఫున పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఆర్.రవి, కార్యవర్గ సభ్యుడు వెల్లంకి కూర్మనాథం తెలియజేశారు.

గ్రీవెన్స్‌కు విశేష స్పందన


ఆదివాసీలకు పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: జిల్లాలోని గుమ్మా బ్లాక్ రేగిడి పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు విశేష స్పందన లభించింది. గ్రీవెన్సు సెల్‌కు రేగిడి, బి.కోలాకోట్, తరబ గ్రామాల నుంచి 140 వినతులు వచ్చాయి. వీటిలో 47 వ్యక్తిగతం కాగా మిగతా 93 గుమ్మా బ్లాక్‌కు సంబంధించినవి. ఎక్కువగా సామాజిక భద్రత, భూపట్టాలు, రేషన్ కార్డులు, సాగునీటి వ్యవస్థ, గృహ నిర్మాణాలకు పీఎంఏవై, విద్య, రోడ్లపై పలు వినతులు అందాయి. అనంతరం కలెక్టర్ లింగరాజ్ పండా 101 మంది ఆదివాసీలకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఎఫ్‌వో సుబ్రహ్మణ్యం ఆనంద్, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ మరియం రైయితో, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, గుమ్మా సమితి అధ్యక్షురాడు సునేమీ మండల్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి రమాంచల్ ఖమారి, బీడీవో అనూప్ అభిషేక్ బెహరా, జెడ్పీటీసీ రేణుకా పాత్రో తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు దోచేసిన మాయగాడి అరెస్టు


అరెస్టు చేసిన తపన్ సాహాను చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: మావోయిస్టులమంటూ బెదిరించి జన సేవ కేంద్రం వద్ద ప్రజల డబ్బులు స్వాహా చేసిన మాయగాడిని పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలలుగా చోరుల కోసం పోలీసులు వెతుకుతుంటే ఇప్పటికి దొరికారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తపన్ సాహా, రతన్ సాహా అనే అన్నదమ్ములు పెప్పరమెట్ల పంచాయతీలో ఎస్‌బీఐ కియోస్క్ నిర్వహించేవారు. అక్కడకు డబ్బులు విత్‌డ్రా చేయడానికి వచ్చిన బోడపోదర్, రల్లేగడ, బోడపోథ, పేప్పరమేట్ల పంచాయతీ ప్రజల ఖాతాల నుంచి డబ్బులు మాయం చేసేవారు. దీనిపై కొందరికి అనుమానం వచ్చి ప్రశ్నించగా తమకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, కలెక్టర్ కిడ్నాప్ కేసులో తాము కూడా పాల్గొన్నామని, తమ జోలికి వస్తే అంతు చూస్తామని బెదిరించడం మొదలుపెట్టారు. ఈ ఉదంతంపై గత ఏడాది నవంబర్‌లో సప్న అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం పెప్పరమెట్ల పంచాయతీకి ఆనుకుని ఉన్న ఏఓబీ సరిహద్దు గ్రామం గొంజిబెడ అడవుల్లో తపన్‌ను అరెస్టు చేశారు. ఎస్‌డీపీఓ అలెక్సియస్ తన బృందంతో ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. నిందితుడిని మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాద్వానీ కార్యాలయానికి తరలించారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

పులిదాడిలో గేదె మృతి


పులిదాడిలో చనిపోయిన గేదెను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గంట్యాడ: మండలంలోని మదనాపురం (మరడాం) గ్రామంలో వర్రి శ్రీనుకు చెందిన గేదెపై సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పులి పంజా విసిరింది. కళ్లానికి 500 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లి హతమార్చింది. సర్పంచ్ జాగరపు అప్పారావు సమాచారం మేరకు అటవీశాఖ బీట్ ఆఫీసర్లు వి.రామారా వు, ఎస్.రవికుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి దాడిచేసినట్టు నిర్ధారించారు. పాడి గేదెను కోల్పోయిన రైతుకు పరిహారం అందజే స్తామని చెప్పారు. పులిని పట్టుకునేందుకు బొండపల్లి మండలం మూలపాడు వద్ద బోను ఏర్పాటు చేశామన్నారు.

సెంచూరియన్‌లో ముగిసిన క్రీడాపోటీలు


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సెంచూరియన్ యూనివర్సిటీలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ యోగా, కత్తి యుద్ధం తదితర పోటీలకు పర్లాకిమిడి, రాయగడ, ఒడిశా, ఛత్రపూర్, బలంగీర్, గోపాల్‌పూర్, విజయనగరం క్యాంపస్‌ల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల ఏకాగ్రత పెరిగి చదువులో రాణిస్తారని చెప్పారు. ఈ పోటీల్లో అత్యధికంగా బంగారు పతకాలు సాధించిన మణివరన్ (విజయనగరం క్యాంపస్)కు రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


మృతి చెందిన పవన్ (ఫైల్)

కొమరాడ: మండలంలోని శివిని గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి లారీ ఢీకొనడంతో శివిని గ్రామనికి చెందిన యువకుడు అరసాడ పవన్ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై జగదీష్‌నాయడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఆటో డ్రైవ్ చేస్తూ పార్వతీపురం వైపు వెళ్తున్న పవన్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో త్రీవ గాయాల పాలయ్యాడు. దీంతో వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అయినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

చెట్టుపై నుంచి జారిపడి వృద్ధుడు..

సంతకవిటి: మండలంలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన ఎచ్చెర్ల వీరయ్య(65) చెట్టుమీద నుంచి జారి పడి మృతిచెందినట్లు ఎస్సై ఆర్.జనార్దనరావు సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామ సమీపంలోని తోటలో టేకు చెట్టు ఎక్కి కొమ్మలు తెంచుతుండగా జారిపడిపోయి మృతిచెందినట్లు మృతుడి భార్య శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు. వీరయ్య రాజాంలోని శ్రీనివాసా రోడ్డులో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడని, సోమవారం మార్కెట్ సెలవుకారణంగా చెట్టుకొమ్మలు నరికేందుకు వెళ్లి ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించామన్నారు.


వీరయ్య మృతదేహం

చికిత్స పొందుతూ యువకుడు..

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి–గ్రహపతి అగ్రహారం గ్రామాల మధ్య రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోగా తీవ్ర గాయాల పాలై చికిత్స ఆస్పత్రిలో పొందుతున్న యువకుడు మృతి చెందాడు. విశాఖ జిల్లా, అనంతగిరి మండలం, బొడ్డవర గ్రామానికి చెందిన పులి అయుష్(15) ద్విచక్ర వాహనంపై ఈనెల 9న దేవుపల్లి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఫిజియో థెరపీతో ఉపశమనం

- సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో సేవలు
- అధిక సంఖ్యలో వస్తున్న రోగులు
- నెలలో 1500 మందికి వైద్యుల సేవలు



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ విభాగం


నడుంనొప్పి రోగికి ఫిజియోథెరపీ


మెడనొప్పి రోగికి సేవలు

విజయనగరం ఫోర్ట్: వయసుతో సంబంధం లేకుండా ప్రస్తుతం చాలా మంది నడుము, కీళ్లు, మెడ నొప్పి, పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇటువంటి రోగులకు ఫిజియోథెరపీ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ సమస్యలు ఉన్న వారంతా ఫిజియోథెరపీ చేయించుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గల ఫిజియోథెరపీ విభాగంలో అన్ని రకాల నొప్పులకు సేవలు అందుబాటులో ఉన్నాయి.

ఈ రోగులకే ఫిజియోథెరపీ సేవలు

ఆస్పత్రికి వచ్చే ఓపీతో పాటు ఇన్‌పేషెంట్ రోగులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. శస్త్రచికిత్స అయిన రోగులు త్వరగా కోలుకోవడానికి ఫిజియోథెరపీ దోహదపడుతుంది. పేద, మధ్య తరగతి రోగులు, నడవలేని, కదల్లేని స్థితిలో ఉన్న వారు, దీర్ఘకాలిక ఎముకల సంబంధిత వ్యాధిగ్రస్తులు, న్యూరో సంబంధిత బాధితులు ఫిజియోథెరపీ చేయించుకుంటూ తక్షణమే ఉపశమనం పొందుతున్నారు.

సేవలతో సంతృప్తి



ఫిజియోథెరపీ కోసం నిత్యం రోగులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నారు. సేవలు పొందిన వారంతా సంతృప్తితో వెళ్తున్నారు.

– డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అధిక సంఖ్యలో వస్తున్న రోగులు

సర్వజన ఆస్పత్రిలో ఫిజియో థెరపీ వైద్య సేవలు ఉచితం కావడంతో నిత్యం అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మంది వరకు ఓపీ రాగా 10 నుంచి 20 మంది రోగులు ఇన్‌పేషెంట్‌గా సేవలు పొందుతున్నారు. నెలకు 1500 మంది వరకు ఈ సేవలు పొందుతున్నారు. ఫిజియోథెరపిస్టులు డాక్టర్ అనిల్, డాక్టర్ స్వాతి, డాక్టర్ దీపక్‌లు రోగులకు సేవలు అందిస్తున్నారు.

కూర్చోలేకపోయివాడ్ని



అడుగు తీసి అడుగు వేయలేక పోయేవాడ్ని. కూర్చోవడానికి చాలా ఇబ్బందిగా ఉండేది. 15 రోజులుగా సర్వజన ఆస్పత్రికి వచ్చి ఫిజియోథెరపీ చేయించుకుంటున్నాను. ఇప్పుడు కొద్ది కొద్దిగా నడవగలుగుతున్నాను. కూర్చోగలుగుతున్నాను.

– లెంక వెంకయ్య, నందాం, గంట్యాడ మండలం

సకాలంలో చేయించుకుంటే మంచిది



దీర్ఘకాలిక ఎముకల సంబంధిత వ్యాధులు ఉన్నవారు సకాలంలో ఫిజియోథెరపీ చేయించుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

– డాక్టర్ అనిల్, ఫిజియోథెరపిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

'పంట'భద్రుడు..!

పట్టభద్రుడైన ఆ యువకుడు వినూత్న పద్ధతిలో సాగు చేస్తూ అందరి చేతా ఔరా అనిపించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎందుకూ కొరగాని భూములను ఎంచుకుని సస్యశ్యామలం చేసి లాభాలు ఆర్జిస్తుండడంతో పలువురు రైతులు ఆ యువకుడి దారిలో పయనించేందుకు ఉద్యుక్తులవుతున్నారు. విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని కాగితాపల్లి గ్రామానికి చెందిన యువరైతు దూబ రమేష్ బాబు బీడు భూముల్లో సాధించిన విజయ గాథ ఇలా ఉంది.

- బీడు భూమిలో వాణిజ్య సేద్యం
- మునగ, జామ, డ్రాగన్ తోటల పెంపకం
- నాలుగేళ్లుగా సాగు
- రెండేళ్ల నుంచి ఫలసాయం


కాగితాపల్లిలో డ్రాగన్ తోట

రేగిడి: పుడమితల్లిని నమ్ముకున్న రమేష్‌బాబు దూబ రమేష్‌బాబు నాలుగేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వాణిజ్య పంటలు సాగుచేస్తూ పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. చేసిన సాగుకు రెండేళ్లుగా ఆదాయం వస్తోంది. అది చూసి మిగిలిన గ్రామాల రైతులు కూడా ఆ యువరైతు బాటలో సాగేందుకు సిద్ధమవుతున్నారు.

వానిజ్య పంటల సాగుపై దృష్టి

రమేష్‌బాబు సాగుచేస్తున్న పంటపొలాలు సాధారణ వ్యవసాయభూములు కాదు. పూర్తిగా వ్యవసాయానికి పనికిరాని పంటపొలాలుగా వదిలేసినవి. వ్యవసాయంపై ఆసకితో తమకు ఉన్న పంటపొలాల్లో సేద్యానికి పనికిరాకుండా ఉన్న మెట్టు భూమిని సాగులోకి తీసుకొచ్చాడు. సాధారణ సాగు కాకుండా వాణిజ్యరంగంలో వినూత్నంగా డిమాండ్ ఉన్న పంటలపై దృష్టిపెట్టాడు. వ్యవసాయానికి సంబంధించిన పుస్తకాలు, పలు ప్రాంతాల్లో వ్యవసాయం ద్వారా లాభాలు సాధించిన రైతులను సంప్రదించి తొలుత డ్రాగన్, జామ తోటల సాగు ప్రారంభించిన రమేష్‌బాబు అనంతరం మరికొంత ప్రాంతంలో నేరేడు, గ్రీన్‌యాపిల్, మునగ వంటి పంటలు కూడా సాగుచేస్తున్నాడు. ఈ పంటల్లో డ్రాగన్, జామ తోటలు రెండేళ్లుగా కోతకు వచ్చి ఆదాయాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది మునగ పూతదశకు వచ్చింది. ఇవన్నీ ఒకటికాదు రెండు కాదు ఏకంగా తొమ్మిది ఎకరాల మెట్టు భూముల్లో బిందుసేద్యం ద్వారా సాగుచేపట్టాడు.


తైవాన్‌జామ

నిరీక్షణకు ప్రతిఫలం

డ్రాగన్ తోటలను తొలుత సాగుచేస్తున్న సమయంలో పలువురు రైతులు రమేష్‌బాబును తప్పుబట్టారు. ఈ పంట ఇక్కడ పండదని కొట్టిపారేశారు. గతేడాది కాలంగా ఏడాదికి రెండు పర్యాయాలు పూతకు వచ్చే ఈ డ్రాగన్‌తో 15 టన్నుల డ్రాగన్ దిగుబడి రావడంతో రూ. 2 లక్షల మేర ఆదాయం పొందిన రమేష్ బాబు తరువాత జామ, మునగ పంటలతో కూడా ఏడాదికి మరో రూ.1.50 లక్షల మేర వ్యాపారం చేశాడు. ఇవే కాకుండా డ్రాగన్, జామ నర్సరీలు ప్రారంభించి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. డ్రాగన్, జామ పంటను సూపర్ మార్కెట్‌కు విక్రయించి సకాలంలో ఫలితాలు పొందుతున్నాడు. రెండేళ్ల నిరీక్షణ అనంతరం పంటలు చేతికంది వస్తుండడంతో రమేష్‌బాబు అందరికీ ఆదర్శంగా మారాడు. ఆయన మాదిరి చాలామంది ఈ మండల రైతులు చిన్నచిన్న పొలాల్లో డ్రాగన్ తోటలు వేస్తున్నారు.

సొంతంగా నర్సరీ ఏర్పాటు

రమేష్‌బాబు సాగుచేస్తున్న పొలాల్లో మూడు ఎకరాల్లో డ్రాగన్ మొక్కలు 3500లు వరకూ ఉన్నాయి. పక్కనే ఉన్న మరో మూడు ఎకరాల్లో 3 వేల తైవాన్ జామమొక్కలు పెంచుతున్నాడు. రెండెకరాల్లో మునగతోట, మరో ఎకరా విస్తీర్ణంలో నేరేడు, గ్రీన్ యాపిల్ మొక్కలు సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం ఒక్కో పంట పూతకు వచ్చి విక్రయాలు జరుగుతుండగా, ఈ పంటలన్నీ సేంద్రియ ఎరువుల ద్వారానే పండిస్తున్నారు. చాలా మంది రైతులు ఈయన వద్ద మొక్కలు కొనుగోలుకు వస్తుండడంతో సొంతంగా నర్సరీ ప్రారంభించి డ్రాగన్, జామ, మునగ మొక్కలను కూడా విక్రయిస్తూ సులభపద్ధతిలో లాభాలు ఆర్జిస్తున్నాడు.


నర్సరీలో మొక్కల తయారీ


పూతదశలో డ్రాగన్

సాగు బాగుంది



వాణిజ్య పంటల సాగు ప్రస్తుతం బాగుంది. డ్రాగన్‌కు మంచి డిమాండ్ ఉంది. పంట పూతకు రాక ముందే సూపర్ మార్కెట్ వ్యాపారులు నా దగ్గరికి వచ్చి అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. జామ కూడా పూతదశకు వచ్చింది. మునగ నేరుగా కూరగాయల వ్యాపారులకు చేరుకుంటుంది. మల్టీ క్రాప్‌పై దృష్టి సారించాను. మెట్టుభూములుగా ఉన్న పంటపొలాల్లో డ్రాగన్, జామ, మునగ, యాపిల్ తోటలు వేశాను. ఫలితాలు బాగున్నాయి.

– దూబ రమేష్‌బాబు, కాగితాపల్లి

క్లుప్తంగా

సంగీత, నృత్య వార్షిక పరీక్షలకు నోటిఫికేషన్

శ్రీకాకుళం కల్చరల్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం(హైదరాబాద్) నిర్వహించే సంగీత, నృత్య వార్షిక పరీక్షల సర్టిఫికెట్, డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విజయనగరం ప్రభుత్వ మహారాజా సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులులు దరఖాస్తు ఫారాలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని డీడీ ద్వారా నిర్ణీత రుసుం చెల్లించాలన్నారు. జాతీయ బ్యాంకు నుంచి రిజిస్ట్రార్, పి.ఎస్.తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్ పేరిట డీడీ తీయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 14 వరకు సాధారణ రుసుంతో, 24 వరకు అపరాధ రుసుంతో చెల్లించవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఏప్రిల్ 29 సాయంత్రం 5గంటల్లోగా విశ్వవిద్యాలయానికి అందించాలని సూచించారు.

సౌత్‌జోన్ పోటీల్లో హర్షిత ప్రతిభ



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలకు చెందిన సీఎంఈ డిప్లమో మొదటి ఏడాది విద్యార్థిని కె.హర్షిత ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్సుమీట్‌లో సత్తాచాటారు. ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో టేబుల్ టెన్నిస్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. కళాశాల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, అధ్యాపకులు హర్షితను అభినందించారు.

కురుక్షేత్రకు యూత్ రెడ్‌క్రాస్



విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమంలో భాగంగా హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో జరిగే జాతీయ సమైక్యతా ఉత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లా రెడ్‌క్రాస్ తరఫున ఐదుగురు సభ్యుల బృందం వెళుతున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. జిల్లా నుంచి కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్, శివానీ ఫార్మసీ కాలేజ్‌కు చెందిన యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులు బయలుదేరి వెళుతున్నారని చెప్పారు. ఈ నెల 16 నుంచి 21 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులతో కలిసి వారి ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలను అధ్యయనం చేస్తారని వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి జాతర

పొందూరు: పొందూరు పైడితల్లి అమ్మవారి జాతరకు రెండో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు ఏర్పాటు చేసిన లైటింగ్ భక్తులను ఆకట్టుకుంటుంది.

వైభవంగా నవగ్రహ విగ్రహాల తిరువీధి

నరసన్నపేట: స్థానిక ఉమామహేశ్వరాలయ ప్రాంగణంలో సోమవారం నుంచి నిర్వహించిన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సోమవారం శాస్త్రోక్తంగా విగ్రహాలకు గాంధీనగర్, మెయిన్‌స్ట్రీట్, కోవెల వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. విగ్రహ దాతలు మార్పు విజయకుమార్, అప్పలనాయుడుతోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

సరుబుజ్జిలి: నవధాన్యాల సాగు చేయడం వల్ల భూముల్లో సూక్ష్మజీవుల వృద్ధి చెంది భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయని కొత్తూరు డివిజనల్ యాంకర్ కె.బాబాజీ తెలిపారు. మండలంలోని పాలవలసలో నవధాన్యాలు సాగువల్ల కలిగే ప్రయోజనాలు గురించి రైతులు, మహిళా సంఘాల సభ్యులకు సోమవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ గజ్జన మోహనరావు, సీఆర్పీ రమణమ్మ, ఐసీఆర్పీలు శ్రీదేవి, తిరుపతిరావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లిక

సారవకోట: జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అవలింగి జెడ్‌పీటీ పాఠశాల ఉపాధ్యాయులు వేసిన రంగవల్లిక ఆకట్టుకుంది. నులి పురుగుల నివారణకు ప్రభుత్వం ప్రతిఏటా అందిస్తున్న మాత్రలు 19 ఏళ్లలోపు పిల్లలు, గర్భిణులు వేసుకోవాలని సూచిస్తూ ఈ రంగవల్లికను వేసినట్లు పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు.

నేటినుంచి యోగా శిక్షణ

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ ఆఫీషియల్ కాలనీలో ఈ నెల 14 తేదీ నుంచి సిద్ధి సమాధి యోగాపై 12 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాజు గురుజీ సోమవారం తెలిపారు.

ముల్లు.. అది గులాబీ ముల్లైనా, పిచ్చి పొదల్లో ముల్లైనా.. చివరికి చేప ముల్లైనా గుచ్చుకుంటుందని భయపడతాం. గులాబీని వాడేటప్పుడు, చేపలు తినేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తాం. కానీ పొందూరు ఖాదీ నేతకార్మికులు ఆ ముల్లు లభించక తల్లడిల్లుతున్నారు. వారికి అవసరమైన కృత్రిమ ముళ్ల తయారీకి అనేకమంది ప్రయత్నిస్తున్నారు. అధ్యయనాలు, పరిశోధనలు చేస్తున్నారు. అస్ఫాల్ ఒక ముల్లు కోసం ఇన్ని మల్లగుల్లాలా! ఏమిటి దాని గొప్ప? అని వెటకారం చేయకండి.. చిన్న చూపు చూడకండి. ఎందుకంటే ఆ ముల్లు లేనిదే ఖాదీ దారం తయారు కాదు. ఖాదీ వస్త్రాలు ఆ నునుపు, మెరుపు సంతరించుకోలేవు మరి! అలాగని అన్ని చేపల ముళ్లు పనికిరావు. ఖాదీ వస్త్రాల తయారీకి ఉపయోగపడే ముడి కొండపత్తిలోని పొల్లు తీసి శుభ్రం చేసేందుకు వాలుగు చేప ముల్లు మాత్రమే ఉపయోగపడుతుంది. ఆ చేప దవడ పలువరుసతో ఉండే ప్రత్యేకమైన ముల్లు లభించక దాని ప్రభావం ఖాదీ నేతపై పడుతోంది. అందుకే వాలుగ చేప ముల్లును పోలి ఉండేలా కృత్రిమ పరికరం తయారీకి ఒక సీనియర్ సైంటిస్ట్, ఒక యువజన సంఘం, ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి.



పత్తిని శుభ్రం చేసేందుకు వినియోగించే వాలుగ చేప దవడ భాగాలు

• పొల్లు తీసే ముల్లు

దొరక్క తల్లడిల్లు!



వాలుగ చేప ముల్లుతో పత్తిని శుభ్రం చేస్తూ..

- ముడిపత్తిని శుభ్రం చేయడంలో వాలుగ చేప ముల్లు కీలకం
- ప్రస్తుతం లభ్యం కాని పరిస్థితి
- ప్రత్యామ్నాయాలపై శాస్త్రవేత్తలు దృష్టి





వాలుగ చేప

శ్రీకాకుళం డెస్క్:

పొందూరు ఖాదీ తయారీలో కీలకమైన.. పత్తిని శుభ్రం చేసేందుకు వినియోగించే.. వాలుగ చేప దవడ భాగం అవసరానికి తగినంతగా లభ్యం కావడం లేదా? ఆ చేప ముల్లును సేకరించడం కష్టతరంగా మారిందా..? ఆ ముల్లుకు ప్రత్యామ్నాయాలను రూపొందించే పనిలో సీనియర్ శాస్త్రవేత్తలు దృష్టిపెట్టారా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి.

ఏమిటీ వాలుగ.. ఎందుకీ వెలుగు..

వాలుగు చేప.. శాస్త్రీయ నామం వల్లగో అట్టు. మంచినీటిలో పెరిగే చేప. మిగతా చేపల మాదిరిగా కాకుండా దవడ భాగం విభిన్నంగా ఉంటుంది. దవడలోని ఉండే మృదువైన పళ్లవరసే ఖాదీ వస్త్రం రూపొందించడంలో కీలకం. ఖాదీకి అంత తెలుపు రంగు తీసుకురావడంతో కూడా కీలక పాత్ర దీనిదే.

వినియోగం ఎలా..

వాలుగ చేప దవడ భాగాన్ని మత్స్యకారుల నుంచి సేకరిస్తారు. పైదవడను రెండు ముక్కలుగా, కింది దవడను రెండు ముక్కలుగా చేస్తారు. ఆ ముక్కను ఓ చిన్న కర్రకు దువ్వెన మాదిరిగా కడతారు. దాని సాయంతో పత్తిని శుభ్ర పరుస్తారు. ఈ క్రమంలో పత్తి మృదువుగా తయారవడంతో పాటు మరింత తెలుపుగా మారుతుంది. ఎడమ చేతి వాటం ఉన్న నేత కారులు ఎడమ దవడను, కుడి చేతి వాటం ఉన్న వారు కుడి దవడను వినియోగించి పత్తిని శుభ్రపరిచేందుకు వినియోగించడం మరో విశేషం.

గతంలో రాజమండ్రి నుంచి..

తొలినాళ్లలో రాజమండ్రి ధవళేశ్వరం నుంచి కరకు సత్యమ్మ అనే మహిళ పొందూరు ఖాదీ కార్యాలయానికి వాలుగ చేప దవడల్ని సరఫరా చేసేవారు. ఆమె మరణానంతరం అక్కడ్నుంచి ముల్లు రావడం లేదు. శ్రీకాకుళం, విజయనగరం పరిసరాల్లోని మత్స్యకారులు అడపాదడపా తెచ్చి విక్రయిస్తున్నారు.

ప్రత్యామ్నాయాల రూపకల్పనలో..

- ఖాదీ తయారీలో వాలుగ చేప దవడ కీలకం కావడం.. అవసరమైన మేర లభ్యత లేకపోవడంతో ప్రత్యామ్నాయాలపై సీనియర్ శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. మహరాష్ట్ర వార్ధాలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్(ఎంజీఐఆర్ఐ) సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త మహేష్‌కుమార్ ఆధ్వర్యంలోని ఓ బృందం స్టీల్‌తో వాలుగ చేప దవడ మాదిరిగా ఓ పరికరాన్ని రూపొందించింది. దీనిని హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్‌ఎంఈ సంస్థ తయారుచేసింది. ఆ పరికరం పనితీరును పొందూరు ఖాదీ తయారీలో ప్రయోగాత్మకంగా పరిశీలించింది. కానీ వాలుగ చేప దవడతో వచ్చేంత మృదుత్వం ఈ పరికరంతో రాలేదు. నేతన్నల చేతులకు గాయాలవ్వడం.. ఇతర అంశాల కారణంగా ఆ పరికరం వినియోగంలోకి రాలేదు.



శాస్త్రవేత్త మహేష్ కుమార్ తయారు చేసిన కృత్రిమ పరికరం



- అయినా సీనియర్ సైంటిస్ట్ మహేష్ కుమార్ ప్రత్యామ్నాయాలపై పట్టువిడవలేదు. చేప దవడ మాదిరిగానే ఉండేలా సన్నని ప్లాస్టిక్ సూదుల్ని స్విట్జర్లాండ్‌లో, దవడ భాగాన్ని థాయ్‌లాండ్‌లో రూపొందించి మరో కొత్త పరికరాన్ని రూపొందించారు. కానీ ఈ పరికరం ఖర్చు ఎక్కువగా ఉండడంతో.. ఖాదీ కమిషన్ ఆఫ్ ఇండియా అనుమతి కోసం పంపించారు.
- జిల్లాకు చెందిన పొగిరి జశ్వంత్‌నాయుడు (చెన్నై ట్రిపుల్ ఐటీ, ఐఐఎం అమృత్‌సర్ పూర్వ విద్యార్థి) బృందం కూడా ప్రత్యామ్నాయ పరికరంపై దృష్టి సారించింది. ఐఐఎం అమృత్‌సర్ వేదికగా ఐదుగురు సభ్యుల బృందం త్రీడీ టెక్నాలజీ సాయంతో మోడల్‌ను రూపొందించింది. ప్లాస్టిక్‌ది కావడం.. ఇతర అంశాల వల్ల ఇదీ సఫలీకృతం కాలేదు. ఈ బృందం మరిన్ని ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది.
- పొందూరుకు చెందిన ఆంధ్రప్రదేశ్ ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం(ఏఎఫ్‌కేకే) వాలుగ చేప సేకరణకోసం విస్తృతంగా ప్రయత్నిస్తోంది. వాలుగ సేకరణ కష్టంగా మారడంతో దానిని పోలి ఉండే మరో రకం చేపపై దృష్టిసారించారు. హిరమండలం రిజర్వాయర్‌లో వీటిని సేకరించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ దీని వినియోగంలో కూడా ఇబ్బందులు ఉన్నాయి. త్వరగా విరిగిపోవడం, అరిగిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దీనిని వినియోగిస్తున్నారు.

- విదేశీ సాంకేతికతతో తయారు చేసిన ప్రత్యామ్నాయ పరికరం ఖరీదు రూ.750 వరకు ఉంది.
- అదే వాలుగ చేప దవడ అయితే కేవలం రూ.25 నుంచి రూ.50 వరకు ఉంది.

వాలుగుకు ఏదీ సాటిరాదు..

పత్తిని శుభ్రం చేసేందుకు వాలుగ చేప దవడకు ప్రత్యామ్నాయం లేదనే చెబుతున్నారు నిపుణులు. ఆ సున్నితత్వం.. ఆ శ్వేతవర్ణం వాలుగుకు ఏదీ సాటిరాదంటున్నారు. విజయనగరం జిల్లా వంగర మండలం మడ్డువలస రిజర్వాయర్‌లో వాలుగ చేపలు ఉన్నాయని జీవవైవిధ్య పరిశోధకులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో వేట సాగించే మత్స్యకారులకు దీని వినియోగంపై విస్తృతమైన అవగాహన కల్పించి వారితో ఒప్పందం కుదుర్చుకుంటే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా కూడా ఖాదీ బోర్డు ప్రయత్నాలు ప్రారంభించాల్సిన అవసరం ఉందంటున్నారు.



దారం తయారీకి సిద్ధమైన పత్తి

స్విట్జర్లాండ్‌లో తయారీ..



వాలుగ చేప దవడకు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే ఒక పరికరాన్ని రూపొందించాం. కొన్ని ఇబ్బందులు గమనించాం. అందుకే విదేశీ పరిజ్ఞానంతో కొత్త ప్రాజెక్ట్ పూర్తి చేశాం. తలవెంట్రుకల పరిమాణంలో ఉండే సూదులను ప్లాస్టిక్ మెటీరియల్‌తో స్విట్జర్లాండ్‌లో రూపొందించాం. దవడ భాగాన్ని థాయ్‌లాండ్‌లో తయారు చేయించాం. పరికరం ఖరీదు కాస్త ఎక్కువ.

–మహేష్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్, ఎంజీఐఆర్ఐ, వార్ధా, మహారాష్ట్ర

ఆ రిజర్వాయర్‌లో గుర్తించాం..



వాలుగ చేప శాస్త్రీయ నామం వల్లగో అట్టు. ఇది మంచి నీటి చేప. మా అధ్యయనాల్లో వాలుగు చేపలు మడ్డువలస రిజర్వాయర్‌లో విస్తృతంగా ఉన్నాయి. చాలా పెద్ద సైజుల్లోనే లభ్యమవుతున్నాయి.

–డాక్టర్ కర్రి రామారావు, జీవవైవిధ్య శాస్త్రవేత్త, డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖపట్నం

ప్రయత్నం చేస్తున్నాం..



పొందూరు ఖాదీలో కీలకమైన వాలుగ చేప దవడ భాగం సేకరణ కష్టతరం కావడంతో ప్రత్యామ్నాయాల దిశగా ఐఐఎం అమృత్‌సర్ వేదికగా మా టీమ్ దృష్టి సారించింది. ప్రొఫెసర్‌తో సహా ఐదుగురు సభ్యులు ఓ పరికరాన్ని రూపొందించాం. కొన్ని ఇబ్బందులు గమనించాం. పూర్తి పర్యావరణ హితమైన మెటీరియల్‌తో తయారు చేసేందుకు మా వంతు ప్రయత్నం మేం చేస్తున్నాం.

– పొగిరి జశ్వంత్ నాయుడు, స్ట్రేటజీ కన్సల్టెంట్, ఈవై

కొరత వాస్తవమే..



పొందూరు ఖాదీకి కీలకమైన వాలుగ చేప దవడ కొరత వాస్తవమే. చాలా మంది ప్రత్యామ్నాయాల వేటలో ఉన్నారు. కానీ అవి సఫలీకృతం కాలేదు. మా వంతుగా ఇటీవలే హిరమండలం రిజర్వాయర్‌లో వేరే రకం చేపను వినియోగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాం. వాలుగుకు ఏదీ సాటి రాదు.

–డి.వెంకటరమణ, సెక్రటరీ, ఏఎఫ్‌కేకే, పొందూరు

శిక్షణ తీసుకున్నాం..



కృత్రిమ చేప ముల్లుతో పత్తిని శుభ్రం చేసే ప్రక్రియను నేర్చుకునేందుకు హైదరాబాదుకు వెళ్లాం. దీని వినియోగంతో నాణ్యమైన 100 కౌంటు దారం రాదు. ఈ కృత్రిమ ముల్లుతో చేయడం వల్ల చేతి వేళ్లకు గాయాలై రక్తం వచ్చేది. అందుకే దీనిని వినియోగించలేదు.

–కాపల కుమారి, చేనేత కార్మికురాలు

వసతి గృహ విద్యార్థులకు అస్వస్థత

- 39 మందికి వాంతులు, విరోచనాలు
- ఫుడ్ పాయిజినింగ్ కారణమన్న వైద్యులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం బీసీ బాలురు వసతి గృహం విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం ఉదయం టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. ఇక్కడ మొత్తం 88 మంది విద్యార్థులు ఉంటున్నారు. 5 నుంచి 9వ తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థులు ఉదయం అల్పాహారం తిన్న తర్వాత కడుపునొప్పి, వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడటంతో వసతి గృహం వార్డెన్ టి.అప్పారావు హుటాహుటిన ఆటోలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ కె.వినోద్‌కుమార్ విద్యార్థులను పరిశీలించి కలుషిత ఆహారం వల్లే అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. అనంతరం చికిత్స అందించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మితులసి ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం వసతిగృహానికి వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మిగిలిన విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇంతలో మరో 16 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పితో బాధపడటంతో వారిని కూడా టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. రాత్రి 8.30 సమయంలో మరో 10 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. మొత్తం 39 మంది విద్యార్థులు ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి ఆరా తీశారు. ఎంపీడీఓ జి.ఉమాసుందరి, తహశీల్దార్ కిషోర్‌లు వైద్యులతో మాట్లాడారు. వసతి గృహంలో ఆదివారం మధ్యాహ్నం చికెన్‌తో అన్నం, రసం, రాత్రికి పప్పు అన్నం పెట్టారు. సెలవు కావడంతో కొంత మంది విద్యార్థులు వసతి గృహం సమీపంలోని మామిడి కాయలు, సీమచింతకాయలు తిన్నట్లు తెలిసిందే. అందుకే ఫుడ్ పాయిజినింగ్ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మితులసి

ఆకట్టుకున్న గణితాకృతి

పొందూరు మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకుని సోమవారం విద్యార్థులు గణిత సంకేతమైన 'పై' ఆకారంలో ఏర్పడి ఆకట్టుకున్నారు. నిత్య జీవితంలో గణిత శాస్త్ర ఆవశ్యకతను ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, చౌదరి వేణుగోపాల్‌లు వివరించారు.

– పొందూరు



ముత్యాలపోలమ్మ.. చల్లగా చూడమ్మా..



ముత్యాల పోలమ్మ గ్రామదేవత చీరలు వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం



పూజలందుకుంటున్న ముత్యాలపోలమ్మ

మెళియాపుట్టి: చాపరలోని గ్రామదేవత ముత్యాల పోలమ్మ ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ కలసి దీపారాధన, హోమాలు చేశారు. పోలమ్మతల్లి గ్రామాన్ని చల్లగా చూడాలని ప్రజలు కోరుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. సంవత్సర కాలంగా పోలమ్మతల్లికి ప్రజలు అందించిన సుమారు 500 చీరలను వేలంపాట వేశారు. ఆ మొత్తాన్ని ఆలయ ఖర్చులకు ఉపయోగిస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ బోసిరామారావు, గ్రామ ప్రజలు పోలినాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

మూడు పూరిళ్లు దగ్ధం



కాలిపోయిన పూరిళ్లు

గార: శ్రీకూర్మం మేజర్ పంచాయతీలోని వనుము వానిపేటలో సోమవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు, ఆరు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించాయని బాధితులు చెబుతున్నారు. ఈ ఘటనలో వనుము నీలమ్మ, ఆవాల లక్ష్మి, కుర్రు అప్పలరామయ్యలకు చెందిన మూడు పూరిల్లు, పిట్ల కుర్లోడు, రాజారావు, కుర్రు రాజప్పడు, కుర్రు సింహాచలం, వనుము దాలప్పడు, కుర్రు అప్పలరాజులకు చెందిన పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.లక్షా 50 వేలు నష్టం జరిగినట్టు రెవెన్యూ వర్గాలు ప్రాథమికంగా అంచనా వేశాయి. కుర్రు అప్పలరామయ్యకు చెందిన రూ.50 వేలు నగదు, వనుము నీలమ్మకు చెందిన రూ.25 వేలు, ఆవాల లక్ష్మీకి చెందిన రూ.10 వేలు నగదు, పావుతులం బంగారం అగ్నికి ఆహుతయ్యాయి. శ్రీకాకుళం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వీఆర్వోలు జగదీశ్వరరావు, రంగారావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కంబకాయ, చెన్నాపురంలో..

నరసన్నపేట: మండలంలోని కంబకాయ, చెన్నాపురం గ్రామాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు సంభవించాయి. కంబకాయలో లబ్బ రాజారావు, రామారావులకు చెందిన మూడు గడ్డి కుప్పలు, 10 బస్తాల ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.40 వేల వరకూ ఆస్తి నష్టం ఉంటుందని అంచనా. చెన్నాపురం రావాడ సింహచలం, రావాడ సరస్వతమ్మలకు చెందిన గడ్డివాములు, పిట్ట సింహాచలం చెందిన గడ్డి వాము, పశువుల శాల దగ్ధమయ్యాయి. లక్ష రూపాయల వరకూ ఆస్తి నష్టం కలిగినట్లు సమాచారం. అగ్ని మాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.